క్లుప్తంగా

ఆడపిల్లలు దేశానికే గర్వకారణం



మాట్లాడుతున్న సీడీపీఓ సరిత

దుబ్బాకటౌన్: ఆడపిల్లలు దేశానికే గర్వకారణమని గజ్వేల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ సరిత అన్నారు. రాయపోల్ మండలం వడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలల హక్కులను పరిరక్షిస్తూ వారి భవిష్యత్‌కు ప్రణాళికలు వేయాలన్నారు. బాల్య వివాహాలు, బాలల హక్కులు, బాలల పరిరక్షణ గురించి అవగాహన కల్పించామని చెప్పారు. ఆడపిల్లలు శారీరక ఎదుగుదల, సంపూర్ణ ఆరోగ్యం కోసం పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షబానా, ఉపాధ్యాయులు రజని, అంగన్వాడీ టీచర్లు యాదమ్మ, రేణుక, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా డ్రైవర్స్ డే



డ్రైవర్లతో సీఐ మురళి తదితరులు

గజ్వేల్‌రూరల్: ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత డ్రైవర్లదేనని ట్రాఫిక్ సీఐ మురళీ, జీపీపీ ఆర్టీసీ డిపో మేనేజర్ పవన్ అన్నారు. ప్రజ్ఞాపూర్‌లోగల జీపీపీ ఆర్టీసీ డిపోలో శుక్రవారం డ్రైవర్స్ డే నిర్వహించారు. ఉత్తమ డ్రైవర్లైన ఎండీ మోసిన్, చంద్రయ్య, కె.రాములు, ఎస్కే మసూద్‌మీరా, నర్సింహులును సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ బాబునాయక్, ఏఎంఎఫ్ జమీల్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా కృషి చేశా..



భూమిపూజ చేస్తున్న వనిత

దుబ్బాకటౌన్: మున్సిపల్ అభివృద్ధే లక్ష్యంగా ఐదేళ్లపాటు అహర్నిశలు పని చేశామని మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత అన్నారు. చెల్లాపూర్ 3వ వార్డులో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మంజూరు చేసిన రూ.10 లక్షల ఎంపీ ల్యాడ్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు వార్డు కౌన్సిలర్ మల్లారెడ్డి, కమిషనర్ రమేశ్ కుమార్‌తో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల పాటు తనకు అవకాశం ఇచ్చిన ప్రజలకు, సహకరించిన కౌన్సిలర్లకు ధన్యవాదాలు తెలిపారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



చెక్కులను పంపిణీ చేస్తున్న గోపీకృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సీఎం సహాయనిధితో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపీకృష్ణ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వైద్య ఖర్చుల నిమిత్తం పలువురికి మంజూరైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాండు, సదశివారెడ్డి, రశాద్, రాజిరెడ్డి, కరుణాకర్, జనార్దన్ రెడ్డి, సాయిప్రతాప్, వనజ, సంతోషి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సాయం అభినందనీయం

ములుగు(గజ్వేల్): పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎంఈఓ ఉదయ్‌బాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తూరు ప్రాథమిక పాఠశాలకు మేడ్చెల్ ఐడీబీఐ బ్యాంక్ అధికారుల సహకారంతో రూ.1.5 లక్షల విలువచేసే నీటిశుద్ధి యంత్రం, కంప్యూటర్ ప్రింటర్, మైక్‌సెట్‌ను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ రీజిన్ కోఆర్డినేటర్ శ్యాం సుందర్, మేడ్చెల్ ఐడీబీఐ బ్యాంక్ అధికారులు సంతోష్, మోషిన్ రుబాకీ, హెచ్‌ఎం అభిషేకమ్మ, కాంప్లెక్స్ హెచ్‌ఎం రహీం, కాంగ్రెస్ నాయకులు గణేశ్‌యాదవ్, రవి ముదిరాజ్, యాదగిరి, కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనం.. ఎప్పుడు మోక్షం



ప్రారంభానికి నోచుకోని గండిపల్లి పంచాయతీ భవనం

అక్కన్నపేట మండలంలో గత ప్రభుత్వం హయాంలో 12 నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఒక్కొక్క నిర్మాణానికి రూ.20లక్షల చొప్పున నిధులు కూడా కేటాయించారు. ప్రస్తుతం రెండు భవనాల నిర్మాణం పూర్తికాగా, 5 భవనాలకు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మిగిలిన మరో ఐదు భవనాల నిర్మాణానికి ఎవరూ ముందుకు రాలేదు. మండల పరిధిలోని గండిపల్లి, మంచినీళ్లబండ గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణ పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభానికి మాత్రం నోచుకోవడంలేదు. అదేవిధంగా గొల్లకుంట, మసిరెడ్డితండాలలో భవన నిర్మాణాల పనులు చివరిదశలో ఉన్నాయి. కలెక్టర్ దృష్టిసారించి పంచాయతీ భవనాలను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్):

రోడ్డుపైనే మురుగు.. సాగేదెలా ముందుకు?



రామవరంలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

మండలంలోని రామవరం నడ్డిబొడ్డున మురుగునీరు రోడ్డుపైనే పారుతోంది. దాదాపు వంద మీటర్ల పొడవునా ప్రధాన రహదారికి ఆనుకొని, రోడ్డుపై నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. దీంతో అనారోగ్యం పాలవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కొన్ని రోజులుగా రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినా ఎవరూ పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి రామును సంప్రదించగా ఇటీవల రోడ్డు పక్కనే బోరువేశామని, ఆనీరు రోడ్డుపై నిల్వ ఉంటుందని చెప్పారు. త్వరగా నూతనంగా వేసిన బోరు వద్ద ఇంకుడు గుంతను నిర్మించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

అక్కన్నపేట(హుస్నాబాద్):

ఆఖరి రోజు అదే లొల్లి

- తమ పేర్లు లేవంటూ నిలదీసిన జనం



కేశవాపూర్ గ్రామసభలో అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు

అక్కన్నపేట(హుస్నాబాద్): అధికారులు నిర్వహించిన గ్రామసభల్లో గ్రామస్తులు, మహిళలు లొల్లికి దిగారు. అక్కన్నపేట మండలం కేశవాపూర్, పంతుల్‌తండా, గోవర్ధనగిరి గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీఓ భానోతు జయరాం, తహసీల్దార్ అనంతరెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. కేశవాపూర్‌లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద లబ్ధిదారులలో తమ పేర్లు లేవంటూ మహిళలు అధికారులను ప్రశ్నించారు. ఈ జాబితాలో సగానికిపైగా అనర్హుల పేర్లే ఉన్నాయని వాపోయారు. సంక్షేమ పథకాలు వర్తించాలని, ఈ గ్రామసభలోనే భూమిలేని వారిని గుర్తించాలని పట్టుపట్టారు. కార్యక్రమంలో ఎంపీఓ మోహన్‌నాయక్, ఇరిగేషన్ ఏఈ మంజుల, ఏఎస్ఓ చామంతి, ఏఈఓలు సింధూజ, విజయ్, పంచాయతీ కార్యదర్శులు గౌతమ్, సుభాష్, శ్రీకాంత్, పార్టీ మండలాధ్యక్షుడు అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో గందరగోళం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని కమ్మర్లపల్లి, మల్లారం, ఎల్లమ్మజాలు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలో గందరగోళం నెలకొంది. జాబితాలో అనర్హులను ఎంపిక చేశారంటూ గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన తమకు అన్యాయం చేశారంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. అర్హులైన వారందరికీ పథకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రసాభాసగా..

సిద్దిపేటరూరల్: రూరల్ మండల పరిధిలోని బచ్చాయిపల్లి, తోర్నాల, రాంపూర్ అలాగే నారాయణరావుపేట మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలు రసాభాసగా మారాయి. నారాయణరావుపేట గ్రామసభకు పెద్ద ఎత్తున అన్ని పార్టీల నాయకులు హాజరై ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయాలని, గ్రామసభ ఆమోదం తర్వాతనే లబ్ధిదారులను ఎంపిక చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. రుకావడంతో పోలీసులు సముదాయించారు. ఎంపీడీఓ రాములు, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శి, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల దాడులు చేయడం సరికాదు

జగదేవ్‌పూర్(గజ్వేల్): గ్రామసభలో బీఆర్‌ఎస్ నేతలు దాడులు చేయడం సమంజసం కాదని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు దయానంద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లపాలన చేసినా ప్రజలకు సంబంధం లేకుండా పథకాలను ప్రవేశపెట్టారన్నారు. రేషన్‌కార్డులు, డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నాలుగు పథకాలకు స్వాగతం పలుకుతున్నామని, పారదర్శకంగా అర్హులైన వారిని ఎంపికచేసి అందించాలని, ఉపాధి హామీకి లింకు లేకుండా పది గుంటలలోపు భూమి ఉన్న ప్రతి ఒక్కరికీ ఆత్మీయ భరోసా ఇవ్వాలని కోరారు.

కాసులాబాద్‌లో వాగ్వాదం

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని కాసులాబాద్‌లో జరిగిన గ్రామసభలో గ్రామస్తులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. గత ప్రజాపాలన కార్యక్రమంలో ఇచ్చిన దరఖాస్తులకు అతీగతీ లేదు కానీ ప్రస్తుతం గ్రామసభల పేరిట కాలయాపన చేయడానికి వచ్చారా? అంటూ సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు అధికారులను ప్రశ్నించారు. సంక్షేమ పథకాల అమలుకు అనర్హుల పేర్లు ఎలా చేరుస్తారని మండిపడ్డారు. దీంతో మండల ప్రత్యేక అధికారి గణేశ్‌రామ్ కలిగించుకుని అర్హులైన వారిని ఎంపిక చేయడానికే సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మల్లేశం, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న మంజుల

సిద్దిపేటజోన్: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందించాలని మున్సిపల్ చైర్మన్ మంజుల అధికారులకు సూచించారు. 33, 34, 35, 37, 41వ వార్డుల్లో నిర్వహించిన సభల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించి త్వరితగతిన ప్రయోజనం కలిగేలా చూడాలన్నారు. ఆయా వార్డుల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తస్లీమ్ బేగం, సుందర్, సాయిఈశ్వర్‌గౌడ్, దీప్తి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ న్యాయం చేయాలి

దుబ్బాక: అర్హులైన పేదల అందరికీ ప్రభుత్వం న్యాయం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత అన్నారు. 18వ వార్డులో జరిగిన సభలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు శ్రీరాం సరస్వతి, నరేందర్, దేవేందర్, భరత్, బీఆర్‌ఎస్ నాయకులు మధు, భాను, దుబ్బయ్య తదితరులు ఉన్నారు.

ఆత్మీయభరోసా అందించాలి

సిద్దిపేటరూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అర్హులైన వారందరికీ అందించేలా చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎర్ర యాదయ్య కోరారు. మండల పరిధిలోని బుస్సాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో చాలా మంది పేదలు ఉపాధిహామీ పని చేసినప్పటికీ కొంతమందిని మాత్రమే ఎంపిక చేయడం సరికాదన్నారు. మాజీసర్పంచ్ యాదయ్య, ఐలారెడ్డి, శేఖర్, ఐలారెడ్డి, షాదుల్, రాజు, మహిళలు పాల్గొన్నారు.

అర్హులంతా దరఖాస్తు చేసుకోండి

చేర్యాల(సిద్దిపేట): ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ స్వరూపరాణి సూచించారు. 10, 11, 12వ వార్డుల్లో జరిగిన సభలలో సంక్షేమ పథకాల కోసం పలువురు అందించిన దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలన్నారు. కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు లీల, తార, సతీష్, కమిషనర్ నాగేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకత పాటిస్తాం



దరఖాస్తులు స్వీకరిస్తున్న అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఇందిరమ్మ ఇళ్లకు అర్హుల ఎంపికలో పారదర్శకత పాటిస్తామని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. పలు వార్డులలో నిర్వహించిన సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులందరికీ పథకాలు అందిస్తామన్నారు. సభలను అడ్డుకునేందుకు బీఆర్‌ఎస్ నాయకులు గొడవలు, దాడులకు తెరలేపారని ఆరోపించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బాల్‌లక్ష్మి, ఆనంద్, యాదగిరి, అన్నపూర్ణ, మధు, నజ్జు, ఫయాజొద్దీన్, అనిల్ కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను తాకితే మాడిపోతారు

మద్దూరు(హుస్నాబాద్): కాంగ్రెస్ పార్టీ నాయకులు హై టెన్షన్ వైర్ లాంటోళ్లని, తాకితే మాడిపోతారని చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి అన్నారు. తాజ్ గార్డెన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లలో జరగని అభివృద్ధి కేవలం యేడాదిలో జరగడంతో బీఆర్‌ఎస్ నాయకులకు మింగుడు పడడం లేదన్నారు. గ్రామసభలు నిర్వహించి పథకాలు అందిస్తుంటే ఓర్వలేని ఆందోళనలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లేశం, శ్రీధర్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోసమే విమర్శలు

గజ్వేల్: రాజకీయ ఉనికిని చాటుకోవడం కోసమే బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్ ఆరోపించారు. గజ్వేల్‌లో వారు మాట్లాడుతూ పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ఏనాడూ గ్రామసభలు నిర్వహించలేదని, ఒక్కరికైనా రేషన్ కార్డులను అందించారా అంటూ ప్రశ్నించారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా ఉండి, రెండు దఫాలు సీఎంగా బాధ్యతలు నిర్వహించిన కేసీఆర్ ఏనాడూ ఈ ప్రాంత ప్రజలను పట్టించుకోలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు వహీద్, సమీర్, రాములు, రమేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీను, బోసు, జాకీర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం సహకారంతోనే..

అక్కన్నపేట(హుస్నాబాద్): కేంద్ర ప్రభుత్వం సహకారంతోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వమే ఇస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరాచారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజలను మభ్యపెట్టడానికే..

జగదేవ్‌పూర్(గజ్వేల్): పథకాల పేరుతో ప్రజలను మభ్య పెట్టడానికే కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తోందని ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు కిరణ్‌గౌడ్ అన్నారు. జగదేవ్‌పూర్‌లో ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల కోసమే పథకాలను తెరపైకి తీసుకువచ్చారని ఆరోపించారు.

స్థానిక ఎన్నికల్లో లబ్ధి కోసమే..



మాట్లాడుతున్న సాయిరాం

సిద్దిపేటజోన్: స్థానిక ఎన్నికల్లో ప్రజల నుంచి తిరుగుబాటు రాకుండా కాంగ్రెస్ వ్యూహాత్మక ఆలోచనతో గ్రామ, వార్డుసభలను చేపట్టిందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరాం, చిన్నకోడూర్ ఆత్మకమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ ఆరోపించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అర్హుల జాబితా అస్పష్టతగా ఉందన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు సుందర్, మోహిజ్, సాయి ఈశ్వర్, నాయకులు షాహిద్, జానీ, ప్రేమ్, సాగర్, ఎల్లయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల నిరసన

హుస్నాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు నిరసన తెలిపారు. గ్రామసభలు, వార్డు సభల్లో దరఖాస్తులదారుల పేర్లను మాత్రమే ప్రకటిస్తున్నారని, లబ్ధిదారులను ఎంపిక చేయడం లేదన్నారు.

వర్గల్ గ్రామసభలో మాజీ ఎమ్మెల్యే

వర్గల్(గజ్వేల్): మండల కేంద్రం వర్గల్‌లో జరిగిన గ్రామసభలో మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా తున్కిఖాల్సా, వేలూరులో సభలు జరిగాయి. అర్హులకు పథకాలు వర్తింపజేయాలని ఆయాసభలలో గ్రామస్తులు డిమాండ్ చేశారు. దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముగిసిన సభలు

గజ్వేల్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన శుక్రవారంతో ముగిసింది. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో నాలుగు రోజుల పాటు వార్డు, గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు రోజుల పాటు నిర్వహించిన వార్డు సభల్లో మొత్తం 5,397 దరఖాస్తులను స్వీకరించినట్లు మున్సిపల్ కమిషనర్ నర్సయ్య తెలిపారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో 3,212 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

మహిళల రక్షణకు అభయ యాప్

సిద్దిపేటకమాన్: మహిళ రక్షణ కోసం అభయ యాప్ ఉపయోగపడుతుందని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన ఈ యాప్ స్టిక్కర్లను బస్టాండ్ చౌరస్తాలోని పలు ఆటోలకు శుక్రవారం అతికించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఆటోలలో సురక్షితంగా ప్రయాణించడానికి ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. ఆయన వెంట ఏఎస్ఐలు ఉమేశ్, సదాశివరావు సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

దుబ్బాకరూరల్: మండలంలోని హబ్సిపూర్‌లో గల మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా, ఒకరికి జైలు శిక్ష విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఎనిమిది మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి శుక్రవారం వారికి రూ.19వేల జరిమానా, వారిలో ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్‌రూరల్: ప్రధాన చౌరస్తాల వద్ద ఇటీవల నిర్వహించిన తనిఖీలో 15 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుపడ్డారని, వారిలో 15 మందికి రూ.8వేల జరిమానాతో పాటు ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించారని ట్రాఫిక్ సీఐ మురళి తెలిపారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

హుస్నాబాద్: స్త్రీలు విద్యా అవకాశాలను అందిపుచ్చుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షపతి సూచించారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం దేశంలో మహిళల స్థితిగతులపై సదస్సు నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి నయనాదేవి, అధ్యాపకులు బాలరాజు, కుమారస్వామి, సభీ ఫాతిమా, చంద్రమౌళి, విజయ, అనిత, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

చిన్నకోడూరు(సిద్దిపేట): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ బాలకృష్ణ సూచించారు. మండల పరిధిలోని పెద్దకోడూరులో పోలీసు కళాబృందంతో శుక్రవారం కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ తప్పిదాల వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, కళాకారుల బృందం పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

సిద్దిపేటరూరల్: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని గుర్రాలగొంది మాజీ సర్పంచ్ మట్టె నర్సింహారెడ్డి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాలగొంది ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు మాజీ సర్పంచ్ మట్టె నర్సింహారెడ్డి తన మనమరాలు వేద పుట్టినరోజు సందర్భంగా రూ.70వేల ఖరీదు వెచ్చించి క్రీడా దుస్తులు, స్టడీమెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి , హరీశ్‌లు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. పాఠశాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తామన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నిబంధనలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణం

బెజ్జంకి(సిద్దిపేట)/వర్గల్(గజ్వేల్)/హుస్నాబాద్: వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తే సురక్షితంగా ప్రయాణించవచ్చని పోలీసులు తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం బెజ్జంకిలో ఎస్ఐ కృష్ణారెడ్డి, వర్గల్‌లో గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, హుస్నాబాద్‌లో ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాలలో పోలీస్ సిబ్బంది, ఆటో, ఆర్టీసీ డ్రైవర్లు పాల్గొన్నారు.

◆ మత్తుకు బానిసలు కావొద్దు

సిద్దిపేటరూరల్: యువత గంజాయి, మత్తుపదార్థాల బారిన పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని రూరల్ ఏఎస్ఐ పరమేశ్వరి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పుల్లూరులో శుక్రవారం మత్తుపదార్థాల నివారణ గురించి నార్కోటిక్స్ డాగ్స్‌తో కిరాణా షాపులు, ఇతర అనుమానస్పద ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. మత్తు పదార్థాలు కలిగి ఉన్నా, అమ్మినా సమాచారం అందించాలన్నారు. కానిస్టేబుళ్లు ప్రవీణ్ కుమార్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ 28 నుంచి ఖేలో భారత్ క్రీడోత్సవ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఏబీవీపీ ఆధ్వర్యంలో 28 నుంచి 30 వరకు నిర్వహించనున్న ఖేలో భారత్ క్రీడోత్సవ్ ఆటల పోటీలను విజయవంతం చేయాలని క్రీడోత్సవ్ కన్వీనర్ సాయి శంకర్ కోరారు. 'చోడో మొబైల్.. చలో మైదాన్' అనే నినాదంతో దేశవ్యాప్తంగా విద్యార్థులు ఫోన్ విడిచిపెట్టి మైదానం లోకి వచ్చి ఆటల పోటీల్లో పాల్గొనే విధంగా కృషి చేస్తున్నామన్నారు. నాయకులు పరశురాం, భాను, శ్రవణ్, హరీశ్, అభినయ్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

◆ అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

మిరుదొడ్డి(దుబ్బాక): అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ లక్ష్యాన్ని చేరుకోవాలని ఎంఈఓ అంజాగౌడ్ విద్యార్థులకు సూచించారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని జంగపల్లి ఉన్నత పాఠశాల టెన్త్ క్లాస్ విద్యార్థులకు శుక్రవారం దాతల సహకారంతో అల్పాహారాన్ని అందించారు. గ్రామానికి చెందిన కాచం పరమాత్మ, హరిప్రసాద్ 50 రోజుల పాటు విద్యార్థులకు అల్పాహారాన్ని అందించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. టీచర్లు భాస్కర్, వెంకటేశ్, రవి, సౌజన్య, చంద్రయ్య, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

◆ కార్మికుడినే నియమించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలో కార్మిక బోర్డును ఏర్పాటు చేసి, బోర్డు చైర్మన్‌గా కార్మిక నాయకుడినే నియమించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం డిమాండ్ చేశారు. కార్మిక సమస్యలపై రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 31న హైదరాబాద్‌లోని కార్మిక భవన్‌లో నిర్వహించనున్న ఛలో కార్మిక భవన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శుక్రవారం సిద్దిపేటలో కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పరశురాములు, కేశవులు, ప్రశాంత్, విద్యాకర్, శ్రీను, మల్లేశం, నర్సింహులు పాల్గొన్నారు.

◆ పీఆర్సీ అమలుకు డిమాండ్

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగులకు 2023 జూలై నుంచి రావాల్సిన పీఆర్సీని వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ (తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్) రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు జి.తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని కొండాపూర్, అందె, అల్వాల, చెప్యాల, మల్లుపల్లి, కాసులాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యల సేకరణ కార్యక్రమం చేపట్టారు. నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం, రామచంద్రం, విజయ్‌కుమార్, బుచ్చిరెడ్డి, శ్రీకాంత్, హెచ్‌ఎం రాజలింగం, ఉపాధ్యాయులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ 30న అఖిలపక్ష జేఏసీ

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటును కోరుతూ 30న అఖిలపక్ష జేఏసీ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో చేపట్టిన మహాధర్నాకు చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాల పరిదిలోని అన్ని గ్రామాల నుంచి ఇంటికొక్కరు తరలివచ్చి విజయవంతం చేయాలని అఖిలపక్ష జేఏసీ చైర్మన్ వకులాభరణం నర్సయ్యపంతులు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఈడెన్ గార్డెన్‌లో అఖిలపక్ష నాయకులతో కలిసి మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అనేది ఇక్కడి ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అని, అందుకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం డివిజన్ ఏర్పాటుపై కాలయాపన చేయకుండా అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డివిజన్ ప్రకటన చేయాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు బాల్‌నర్సయ్య, మల్లేశం, శ్రీధర్, కరుణాకర్, చంటి, నాగేశ్వర్‌రావు, రాజీవ్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, రంజిత, మానస, సిద్దిలింగం, దాసు, తిరుపతి, సురేష్, రాందాసు, పాండు, ప్రవీణ్, షాదుల్ల, వెంకట్‌మావో, సత్తిరెడ్డి, నాగరాజు, అరుణ్‌కుమార్, రాజు, నారాయణరెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ దయల్ యువర్ డీఎం

గజ్వేల్‌రూరల్: ప్రయాణికులు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ పవన్ కోరారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను శనివారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు జరిగే కార్యక్రమంలో భాగంగా 99592 26270కు కాల్ చేసి చెప్పాలని కోరారు.

◆ దరఖాస్తు చేసుకోండి

వర్గల్(గజ్వేల్)/మద్దూరు(హుస్నాబాద్): రైతు భరోసా పథకం కోసం కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని వర్గల్ మండల వ్యవసాయాధికారి శేషశయన, మద్దూరు మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.